క్లుప్తంగా

8న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ మంచిర్యాల గర్మిళ్ల, రేకుర్తి కంటి ఆసుపత్రిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చెన్నూర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్, సీహెచ్.రాఘవేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు దుప్పట్లు, ప్లేట్, గ్లాస్‌లను వెంట తీసుకురావాలని తెలిపారు.

గిరిజన గూడేల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి

దండేపల్లి: పాఠశాలలు లేని గిరిజన గూడేల్లో ప్రభుత్వం పాఠశాలలు మంజూరు చేయాలని, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రూప్లానాయక్, ప్రకాశ్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దండేపల్లి మండలంలోని చెల్కగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగూడలో పాఠశాల లేక అక్కడి విద్యార్థులు పక్క గ్రామాలకు వెళ్తున్నారని, దీంతో వారికి దూరభారం అవుతుందన్నారు. ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు.

సన్మానం



దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. పాఠశాలకు బదిలీపై కొత్తగా వచ్చిన వారికి వెల్‌కమ్ పలికారు. పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ఆర్' జట్టు గెలుపు



కప్ అందిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుల సహకారంతో స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం నిర్వహించిన క్రికెట్ ఫైనల్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల జట్టు గెలుపొందింది. ఈ పోటీల్లో నాలుగు జిల్లాల నుంచి జట్లు పాల్గొనగా మందమర్రి క్రికెట్ క్లబ్ టీం, ఎస్ఆర్ఆర్ కళాశాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. గెలుపొందిన జట్లకు ప్రకటించిన నగదుతో పాటు కప్‌ను సీఐ మహేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా, క్రీడల్లో రాణించాలని తెలిపారు. పోటీల నిర్వహణతో క్రీడాకారులకు ఉత్సాహం, శరీర ధారుఢ్యం, కొత్త పరిచయాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు ఉన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోదెల గ్రామ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందునా మానసికంగా ప్రశాంతంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఇసాక్, అధ్యాపకులు చంద్రశేఖర్, అరుణ, కుమారస్వామి, సతీష్, సంధ్య పాల్గొన్నారు.

సాష్టాంగ నమస్కారంతో రామేశ్వరం...



మందమర్రిరూరల్: హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం రాజస్తాన్ రాష్ట్రం కరోలి జిల్లాకు చెందిన రాజ్‌గిరి మహరాజ్ అనే భక్తుడు గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ బయలుదేరాడు. శనివారం మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారి గుండా వెళ్తుండగా 'సాక్షి'కి సంప్రదించింది. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో గంగోత్రి నుంచి ప్రారంభించినట్లు, రోజుకు సుమారు పది కిలోమీటర్ల వరకు వెళ్తానని, రామేశ్వరం చేరుకోవడానికి సుమారు 5నెలల వ్యవధి పడుతుందని రాజ్‌గిరి మహరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తుడికి పలువురు శీతల పానీయాలు అందించారు. ఆయన వెంట శిష్యుడు రామ్ నివాస్ గుజ్జర్ ఉన్నారు.

ప్రీ వెడ్డింగ్ షూట్స్

సండే స్పెషల్



- పల్లెలకు పాకిన సిటీ కల్చర్
- దండేపల్లి సమీపంలో 5ఎకరాల్లో 80రకాల సెట్టింగ్‌లతో స్టూడియో
- నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి షూట్స్..

దండేపల్లి: వేడుకలు ఏవైనా కలకాలం గుర్తుండి పోయేలా భద్రపరుచుకుంటోంది యువలోకం. ఆ జ్ఞాపకాలను పదిలం చేసుకునేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చాలా మంది ఈ మధ్య కాలంలో పెళ్లిలకు ముందు ప్రీ వెడ్డింగ్ షూట్స్ కోసం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, రాజమండ్రి ప్రాంతాలతో పాటు అరకు, వంటి దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో అంతదూరం వెళ్లకుండా అందుబాటులోనే ప్రీ వెడ్డింగ్, పోస్ట్‌వెడ్డింగ్, మెటర్నిటీ, బేబీ షూట్‌లు నిర్వహించుకునేలా దండేపల్లి సమీపంలో స్టూడియోను నిర్మించారు. పట్టణాలలో అందుబాటులో ఉండే ప్రీ వెడ్డింగ్ షూట్స్ స్టూడియోలు ఇప్పుడు పల్లెలకు సమీపంలో రావడంతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి చాలా మంది వచ్చి ఇక్కడ ప్రీ, పోస్ట్, మెటర్నిటీ, బేబీషూట్స్ నిర్వహిస్తున్నారు.

5ఎకరాల్లో 80రకాల సెట్టింగ్‌లు..

మండలంలోని మామిడిపల్లిలో 5ఎకరాల్లో 80రకాల సెట్టింగ్‌లతో స్టూడియోను నిర్మించారు. జూమర్ సెట్, వైట్‌హౌస్, బీచ్ థీమ్, బొమ్మరిల్లు, స్విమ్మింగ్‌పూల్, రాజువాడసెట్, కాఫీటేబుల్, పల్లె అందాలతో పాటు, ఫిలిం సిటీని తలపించే వంటి పలు



రకాల సెట్టింగ్‌లు ఇక్కడ ఎంతో అందంగా, సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

చాలా బాగున్నాయి..



స్టూడియో చాలా బాగుంది. అనేక రకాల సెట్టింగ్‌లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నాది ఈ నెల 14న పెళ్లి ఉండటంతో, నేను ఇక్కడ ప్రీం వెడ్డింగ్ షూట్ కోసం వచ్చాం. దూర ప్రాంతాలకు వెళ్లి తీసుకునే షూటింగ్ అంతా ఒకే చోటా జరిపేలా ఏర్పాటు చేయడంతో, సమయం, ఖర్చు రెండు ఆదా అవుతున్నాయి.

– మల్లేష్, కలమడుగు

అంతా ఒకే చోట..



ప్రీ వెడ్డింగ్ షూట్‌ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం కొంత ఇబ్బంది. పైగా నాలుగైదు చోట్లకు వెళ్తే తప్పా షూటింగ్ పూర్తయ్యేది కాదు. ఇప్పుడు ఇక్కడ 80రకాలకు పైగా సెట్టింగ్‌లు ఒకే చోట ఉండటంతో, షూటింగ్ సగానికి పైగా ఇక్కడే పూర్తి చేసుకుంటున్నాం. అందుబాటులో ఉండటం అందరికీ ఉపయోగంగా ఉంది.

– కుమారస్వామి, ఫొటోగ్రాఫర్

దూర ప్రాంతాలకు వెళ్లకుండా..

ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు దూరప్రాంతాలకు వెళ్లకుండా, అందరికి అందుబాటులో ఉండేలా దండేపల్లి సమీపంలో 5ఎకరాల స్థలంలో 80రకాల సెట్టింగ్‌లతో స్టూడియో నిర్మించాం. పెళ్లిల సీజన్‌లో నెలలో సుమారు వంద వరకు షూటింగ్‌లు జరుగుతున్నాయి. ఇవే కాకుండా మెటర్నిటీ, బేబీషూట్స్‌కు కూడా చాలా మంది వస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఆకట్టుకునేలా స్టూడియో ఏర్పాటు చేశాం. చాలా మంది రావడంతో సంతోషంగా ఉంది.

– కుశల్, వెంకటేష్, స్టూడియో వ్యవస్థాపకులు

ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటనపై హర్షం

పాతమంచిర్యాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న హెచ్ ఆర్ మేనేజర్లు, కోర్సు డైరెక్టర్లు, ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు పే స్కేల్ వర్తింపజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రకటించడం సంతోషకరమని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు మునిగంటి రమేశ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 18సంవత్సరాలుగా ఉపాధిహామీలో పని చేస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఉపాధిహామీ కూలీల కుటుంబాలకు 100రోజులు పనులు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడంలో తమ కృషిని ప్రభుత్వం గుర్తించి తమకు పే స్కేల్ ప్రకటించి తమ జీవితాలకు భరోసా కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామనారు.

ట్రస్మా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి చైతన్య భారతీ పాఠశాలలో ట్రస్మా ఆధ్వర్యంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శనివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మేదరిపేట ప్రగతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా, కాకతీయ పాఠశాల విద్యార్థుల ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రాజలింగయ్య, సతీష్, శేఖర్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఊరూరా బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం

నెన్నెల/భీమిని/బెల్లంపల్లి: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో గెలుపే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి మాసు రజిని అన్నారు. తాండూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో, భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లిలో, నెన్నెల మండలంలోని నందులపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం చలో) కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ దేశ వ్యాప్తంగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాలని, కేంద్రంలో బీజేపీ బలంగా ఉందని, రాష్ట్రంలో సైతం బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. దేశంలో మూడో సారి మోదీ ప్రభుత్వాన్ని ఎన్నుకుని, రామ రాజ్య స్థాపనకు పాటుపడాలని పలువురు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్ బీజేపీ మండల అధ్యక్షుడు మహీధర్ గౌడ్, సీనియర్ నాయకులు శేషగిరి, నాయకులు భరత్‌కుమార్, మల్లేష్, సురేష్, భీమిని బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బత్తిని రమేష్‌గౌడ్, కోశాధికారి వెంకటేషం, కార్యదర్శి అమిత్‌సింగ్, యువమోర్చ అధ్యక్షులు నాయిని తిరుపతి, కిసాన్ మోర్చ అధ్యక్షులు శేఖర్, నెన్నెల బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయులు, మండల ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కోట వంశీ, యాదగిరి, నారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్‌లో మాట్లాడుతున్న రజిని

రాముని చెరువు సుందరీకరణ పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: కొన్ని నెలలుగా అర్ధంతరంగా నిలిచిపోయిన రాముని చెరువు సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని వాకర్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును కలిసి విన్నవించారు. వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ.. చెరువులో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించాలని, హైటెక్‌సిటీ, జాఫర్ నగర్ నుంచి వచ్చే డ్రెయినేజీ మురుగు నీటిని చెరువులో కలువకుండా చేయాలని కోరారు. రాముని చెరువు విస్తీర్ణాన్ని ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులతో జాయింట్ సర్వే చేయించి, హద్దురాళ్లు ఏర్పాటు చేసి చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, చెరువు కట్టపై మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మించి, వాచ్‌మెన్ గదిని ఏర్పాటు చేయాలన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సభ్యులు

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

నెన్నెల: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం జగిత్యాల ఫైనల్ ఇయర్ విద్యార్థి ముత్యం తిరుపతి, ఏఈఓ రాంచందర్‌లతో కలిసి శనివారం మట్టి నమూనాలు సేకరించడంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలంలో సేకరించిన మట్టిని పొలాస వ్యవసాయ కళాశాల జగిత్యాల ప్రయోగశాలలో భౌతిక రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం లక్షణాలు, పోషక విలువల స్థాయిని గుర్తిస్తామన్నారు. మట్టిని పరీక్షించిన అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందజేస్తామన్నారు. మట్టి నమూనాలు పరీక్షించుకోవాలని రైతులు వారి నేలలో నాగలి లోతు నుంచి 500గ్రాముల మట్టిని సేకరించి ఎండ తాకకుండా ఆరబెట్టి ఏఓ కార్యాలయంలో అందించాలని కోరారు. పరీక్ష ఫీజు కింద రూ.150చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చిత్తాపూర్, గన్‌పూర్, నెన్నెల, బొప్పారం, మన్నెగూడెం రైతులు పాల్గొన్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు, రైతులు

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తరగతులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభిస్తున్నట్లు కేంద్రం గౌరవ అధికారి, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, కో ఆర్డినేటర్ ఎం.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ నెల 4, 11, 25 మార్చి 3, 10 తేదీల్లో నిర్వహించనున్న తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో జరగనున్న మొదటి సెమిస్టర్ పరీక్షలకు ఆయా తరగతుల్లో చెప్పే పాఠాలు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు తరగతులను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: కిష్టంపేట నుంచి నీల్వాయికి వెళ్లే 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. దీంతో నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల కన్వీనర్‌గా కృష్ణమూర్తి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం హాజీపూర్ మండల కన్వీనర్‌గా కె.కృష్ణమూర్తి నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్ గౌడ్ కృష్ణమూర్తికి నియామక లేఖను అందజేశారు.

'పెద్దపల్లి సీటు చంద్రశేఖర్‌కు ఇవ్వాలి'

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఈ సారి మాదిగ సామాజికవర్గానికి చెందిన ఆగం చంద్రశేఖర్‌కు సీటు ఇవ్వాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్నీ డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం నిర్వహించిన సమావేశంలో మాదిగ అభ్యుదయ సంఘం నాయకులు పలువురు పాల్గొని మాట్లాడారు. 2019ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పెద్దపల్లి పార్లమెంట్ నుంచి చంద్రశేఖర్ అత్యల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. దాదాపు 3లక్షల 45వేల పైచిలుకు ఓట్లు తెచ్చుకున్నారని తెలిపారు. పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని మాలలకే ఇస్తున్నారని, మాదిగలను విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటివరకు ఒకసారి మాత్రమే మాదిగలకు సీటు కేటాయించారని గుర్తు చేశారు. చంద్రశేఖర్‌కు టికెట్ ఇచ్చి బరిలో దింపితే, అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో మాదిగ అభ్యుదయ సంఘం నాయకులు జె.రాజమల్లు, మంతెన మల్లేష్, పొట్ల సురేష్, బి.రాంచందర్, జనగామ మల్లేష్, రామకృష్ణ, రామస్వామి, కొమురేష్, రాజలింగు, శేఖర్, శంకర్, అనిల్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సీసీ రోడ్డు పనులు నిలిపివేయాలి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా సీసీ రోడ్డు వేస్తున్న పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఎంపీడీఓ రాధాకిషన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కన్నెపల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ రాజయ్య అవసరమైన చోట కాకుండా, పాత సిమెంట్ రోడ్డుపై మళ్లీ కొత్త రోడ్డు వేస్తూ నిధులు వృథా చేస్తున్నాడని ఆరోపించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ, రోడ్డు సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా తన ఇంటి ముందు నుంచి బస్టాండ్ వరకు సీసీ రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు వేయడం సరైంది కాదని పేర్కొన్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ రాధాకిషన్ పనులను నిలిపివేయించారు. మండలంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీఉప సర్పంచ్ గడ్డల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోమాస డాగయ్య, బూర్కుటి లక్ష్మణ్, చింతపురి వెంకటి ఉన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

■ బొగ్గుబాయి వార్తలు

వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: మహిళలు వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఎదగాలని బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షురాలు ఎం.నళిని నరేందర్ అన్నారు. తాండూర్ మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో శనివారం వృత్తి శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్, మగ్గం శిక్షణ, డ్రైవింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ తరగతులను సద్వినియోగం చేసుకుని తద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలన్నారు. అనంతరం ఎస్‌వోటు జీఎం నరేందర్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ కార్మికుల, కార్మిక కుటుంబాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా సంస్థ చొరవ తీసుకుంటుందని తెలిపారు. సంస్థ అందిస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని కార్మిక కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్, సేవా సమితి కో-ఆర్డినేటర్ అంజయ్య, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నళిని

'రక్షణ విషయంలో నిర్లక్ష్యం వద్దు'

కాసిపేట: ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధగా ఉండటంతో పాటు రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని బెల్లంపల్లి అండ్ రామగుండం రీజి యన్ జీఎం సేఫ్టీ కెహెచ్‌ఎన్ గుప్తా సూచించా రు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శని వారం కార్మికులకు రక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం జరిగిన ప్రమాదాలు, వాటికి కారణా లు, నివారణ మార్గాలను కార్మికులకు వివరించారు. సంస్థ, కుటుంబాలు బాగుండాలంటే కార్మికుడు ప్రతి అంశంలో రక్షణతో ముందుకు సాగాలన్నారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, రక్షణాధికారి సునీల్‌కుమార్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మైదానాలు కరువు

- ఆటల కోసం బయటకు వెళ్తున్న విద్యార్థులు

చెన్నూర్: విద్యతో పాటు విద్యార్థులకు మానసికోల్లాసం, శరీరధారుఢ్యం కోసం క్రీడల్లో తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ గురుకులాల్లో క్రీడా మైదానాలు కరువయ్యాయి. క్రీడలపై మక్కువ గల కొందరు విద్యార్థులు క్రీడా సాధన కోసం బయటికి వెళ్తున్నారు. పాఠశాల నుంచి నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మైదానాలు లేక..

చెన్నూర్ మైనార్టీ, మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో 5 నుంచి 10 తరగతులకు చెందిన సుమారు 800మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రెండు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో ఆటలాడుకునేందుకు ఆట స్థలాలు లేవు. దీంతో విద్యార్థులు క్రీడా సాధన కోసం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానం, స్టేడియాలకు వెళ్లి వస్తున్నారు. క్రీడా మైదానాలు దగ్గరగా లేకపోవడంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థుల భవి ష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాల మైదానానికి వెళ్తున్న గురుకుల విద్యార్థులు